## క్లుప్తంగా

### జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఏఎస్ఐ శివరామిరెడ్డి

**వెల్దుర్తి:** స్థానిక హైస్కూల్ 2000–01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు, సురేశ్ ఎలెవన్ టీం సంయుక్తంగా పట్టణంలోని బాలుర హైస్కూల్ మైదానంలో జిల్లా స్థాయి సూపర్–8 క్రికెట్ టోర్నీని ఏఎస్ఐ శివరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. హెడ్ కానిస్టేబుళ్లు నరసింహులు, శ్రీను, నిర్వాహకులు శ్రీనివాసులు, సురేశ్, సుమన్, రాహుల్, అనూప్, సూరి, ముత్యాల సుమన్, నగేశ్, మధు పాల్గొన్నారు.

### పక్కీరప్ప తాతకు పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

**మద్దికెర :** మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో కొలువైన అవధూత పక్కీరప్ప తాతను గురువారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆకు పూజ, మహామంగళ హారతి తదితర పూజలు చేపట్టారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

### ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు



ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

**హొళగుంద:** మండలంలోని ఎల్లార్తిలో వెలసిన షేక్షావలి, షాషావలి హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తమ మొక్కులో భాగంగా కొందరు భక్తులు దర్గా ఆవరణలో నిద్రించారు. అలాగే.. హొళగుందలో షిర్డిసాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

### గుడిసె దగ్ధం



కాలిపోయిన గుడిసె

**దేవనకొండ:** మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో కోడుమూరు వీరకోటికి చెందిన గుడిసె గురువారం దగ్ధమైంది. వీరకోటి కుటుంబం ఉదయం పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా గుడిసెకు మంటలు వ్యాపించడంతో గుడిసెలోని నిత్యావసర సరుకులు, వివిధ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. గుడిసె కాలిపోవడంతో వీరకోటి కుటుంబ రోడ్డున పడింది.

### దివ్యాంగ పింఛన్‌దారుల పరిశీలన

**కృష్ణగిరి:** మండలంలో మంచానికే పరిమితమై రూ.15 వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల స్థితిగతులను అనంతపురం జిల్లా వైద్య బృందం సభ్యులు గురువారం తనిఖీ చేశారు. మండలంలోని లక్కసాగరం, కంబాలపాడు, ఎరుకలచెర్వు, పోతుగల్లు, చుంచుఎర్రగుడి, చిట్యాల, అమకతాడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి, కటారుకొండ, ఆలంకొండ గ్రామాల్లో వైద్య బృందం పర్యటించి పింఛన్‌దారుల వివరాలను పరిశీలించడంతోపాటు, వారి స్థితిగతులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మండలంలో 20 మంది దివ్యాంగ పింఛన్‌దారుల స్థితిగతులను పరిశీలించినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. ఈఓఆర్డీ చిన్న లచ్చప్ప, వైద్యాధికారి ప్రదీప్, గజేంద్రారెడ్డి, పీఎస్‌లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

### సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

**మద్దికెర :** మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. గురువారం స్థానిక వైద్యశాలలో సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా, శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని చెప్పారు. ఎక్కువ రోజులు జ్వరాలు వస్తుంటే వెంటనే వైద్యశాలలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని తెలియజేయాలన్నారు.

### ఆశల మామిడి



పులిచెర్ల సమీపంలో విరపూసిన మామిడి పూత

ఈయేడాది పంటలన్నీ దెబ్బతిని అన్నదాతలు కుదేలయ్యారు. కాగా.. మామిడి చెట్లకు పూత బాగా వస్తుండటంతో దిగుబడిపై అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే.. పొగమంచు, చలి తీవ్రతతో వచ్చిన పూత ఉంటుందా లేదా అన్న సందేహం వారిలో నెలకొంది. – కృష్ణగిరి

### చీర..పంటకు రక్ష



బొల్లవానిపల్లి వద్ద పొలం చుట్టూ కట్టిన చీరలు

గ్రామాల్లో వేరుశనగ పంటకు పశువులు, జింకలు, అడవి పందుల బెడద ఎక్కువ వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకోవడానికి బొల్లవానిపల్లి వద్ద ఓ రైతు పాత చీరలను సేకరించి పొలం చుట్టూ కట్టి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. – తుగ్గలి

### ప్రయాణం ఏరీతిగ సాగేను?



గుంతలమయంగా ఉప్పర్లపల్లికి వెళ్లే దారి

మండలంలోని ఉప్పర్లపల్లికి వెళ్లే రోడ్డు పలుచోట్ల పూర్తిగా దెబ్బతినింది. రైల్వే బ్రిడ్జి సమీపంలో రహదారి ఛిద్రమై ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం గుండా నిత్యం జొన్నగిరి, ప్యాపిలికి ప్రయాణికులు అధిక సంఖ్యలో వెళ్తుంటారు. గుంతల కారణంగా వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు. – తుగ్గలి

## పోటీల్లో గుడేకల్ వృషభాల జయకేతనం



రాతి దూలం లాగుతున్న ఎద్దులు

**తుగ్గలి :** మౌలాలిస్వామి ఉరుసు సందర్భంగా గురువారం ఉప్పర్లపల్లిలో నిర్వహించిన దేశవు ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీల్లో ఎమ్మిగనూరు మండలం గుడెకల్ ఎద్దులు విజేతగా నిలిచాయి. పోటీలను టీడీపీ నాయకులు నాగేంద్ర, అప్పా వేణు, బహుమతి దాతలు ప్రారంభించారు. పోటీల్లో 13 జతల ఎద్దులు పాల్గొనగా గుడికల్ చాకలి దస్తగిరి ఎద్దులు 4,545 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. తర్వాతి స్థానాల్లో జొన్నగిరి మస్తాన్‌యాదవ్ ఎద్దులు 4,500 అడుగులు, బొమ్మనహాల్ మండలం ఉద్దేహాల్ బసన్న, లింగదహాల్ ఎర్రిస్వామి ఎద్దులు సంయుక్తంగా 4,235 అడుగులు, దేవనకొండ మండలం జి.ప్యాలకుర్తి ఉశేన్ ఎద్దులు 3,933 అడుగులు, గుడికల్ చాకలి నల్లయ్య ఎద్దులు 3,827 అడుగులు లాగాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు దాతలు అప్పా జగన్‌మోహన్ రూ.30వేలు, మనోహర్, రుసింగముని, లాలుస్వామి, జొన్నగిరి అనుమన్న కలిసి రూ.20వేలు, వేపమాను మహేష్ రూ.15వేలు, ట్రాక్టర్ హుసేన్‌పీరా రూ.10వేలు, జిన్నె ప్రియాంక రూ.5వేల నగదు అందజేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులగౌడ్, వెంకటస్వామి, అప్పా చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, ఈశ్వరయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.





ములుగుందంలో పూర్తయినా వినియోగానికి నోచుకోని సచివాలయం, రైతు భరోసా కేంద్రం

## అలా వదిలేశారు!

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- వినియోగానికి నోచుకోని నూతన సచివాలయ, ఆర్బీకే
- నిధులు లేక అసంపూర్తిగా విలేజ్ హెల్త్ క్లినిక్



నిధులు లేక నిలిచిపోయిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం

**ఆస్పరి:** వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు గ్రామంలోనే ప్రభుత్వ సేవలన్నీ అందాలని గ్రామ సచివాలయం, రైతులకు భూసార పరీక్షల నుంచి విత్తనాలు, ఎరువులు, మందులు, విత్తన మొలకశాతం, ఆధునిక వ్యవసాయం, దిగుబడుల కొనుగోల వరకు అందేందుకు రైతు భరోసా కేంద్రాలను లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించింది. అలాగే.. గ్రామీణులు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలందేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. ఇలా ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్లను నిర్మించారు. ములుగుందం గ్రామంలో రెండు సచివాలయాలు ఉన్నాయి. రెండు సచివాలయలకు రెండు భవనాలు, రెండు రైతు భరోసా కేంద్రాలు, రెండు విలేజ్ హెల్త్ క్లినిక్, ఒక పాల కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేసి కొన్ని భవన నిర్మాణాలను పూర్తి చేశారు. అంతలోనే కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో ఒక సచివాలయం, ఒక విలేజ్ క్లినిక్ నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అయితే రెండు సచివాలయ భవనాలను పూర్తి చేసినా వినియోగించుకోకపోవడంతో కమ్యూనిటీ హాల్‌లో కార్యాలయం నిర్వహిస్తున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తైన భవననాలను వినియోగంలోని తీసుకు రావాలని ములుగుందం, పలకూరబండ గ్రామస్తులు కోరుతున్నారు.

## తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపిక



నాగేశ్వరరావు

**గోనెగండ్ల :** మండల పరిధిలోని పెద్ద మరివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆరెకటికె నాగేశ్వరరావును వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆయన తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గాను పురస్కారం దక్కనుంది. నాగేశ్వరరావు రెండు వేలకు పైగా వచన కవితలు రాశారు. మణిపూసలు ప్రక్రియలో 500, సున్నితం ప్రక్రియలో 700, బాల సాహిత్యంలో 100కు పైగా గేయాలు మెరుపులు, తణుకులు, ముత్యాలహారం, రాజశ్రీయులు మొదలైన ప్రక్రియలో శతాధికంగా రాశారు. అలాగే నాలుగు పుస్తకాలు కవినేత్రం, యుగపురుషులు, కవి పుంగవులు–జాతి నేతలు, అక్షరగ్రామికుడు వంటి పుస్తకాలను ప్రచురించారు. శ్రీ కొత్త పూర్ణానంద్ విలాస్ కళా వేదిక విజయవాడలో శ్రీ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఈనెల 21న జరిగే కార్యక్రమంలో పురస్కారం అందజేయనున్నట్లు నాగేశ్వర రావు గురువారం తెలిపారు.

## ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

**దేవనకొండ:** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం దేవనకొండలోని ఏపీజీబీ బ్యాంకు ముందు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ కడప నుంచి ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించేందుకు ప్రభుత్వాలు ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, తరలింపు ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఏపీలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర వికాస్ గ్రామీణ బ్యాంక్, సప్తగిరి, చైతన్య గోదావరి బ్యాంకుల విలీనం ద్వారా గ్రామీణ బ్యాంకులను ఏకీకరణ చేయడం భవిష్యత్‌లో ప్రైవేటీకరణకు దారి తీస్తుందన్నారు. కడప నుంచి రాజధాని ప్రాంతంలోకి ప్రధాన కార్యాలయాన్ని తరలించేందుకు ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. అనంతరం బ్యాంకు అధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు నాగేష్, బలరాముడు, రాము, మహేష్, వీరాంజనేయుడు తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలు వైభవంగా నిర్వహించాలి

**కర్నూలు(సెంట్రల్):** గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వేడుకలను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ పతాకావిష్కరణ, బారికేడింగ్, వైట్‌వాష్ వంటి ఏర్పాట్లను పరేడ్ గ్రౌండ్‌లో సిద్ధం చేయాలన్నారు. అలాగే స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని, సీటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే పిల్లలు ఎక్కువసేపు ఎండలో నిలబడకుండా 30 నుంచి 45 నిమిషాల్లోపు సాంస్కృతిక కార్యక్రమాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ శామ్యూల్‌పాల్‌ను ఆదేశించారు. అన్ని శాఖల నుంచి ప్రభుత్వ పథకాల వివరాలను క్రోడీకరించి సందేశాన్ని రూపొందించాలని, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని సమాచార శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్‌లో తాగునీరు, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కమిషనర్ రవీంద్రబాబుకు సూచించారు. ప్రథమ చికిత్స కిట్‌తో వైద్య బృందం అందుబాటులో ఉండేలా వైద్య ఆరోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి 26వ తేదీన ఉత్తమ ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాలకు సంబంధించి జాబితాను త్వరగా డీఆర్వో సి.వెంకటనారాయణమ్మకు అందజేయాలన్నారు.

ప్రభుత్వ పథకాల అమలును ప్రతిబింబించేలా శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, అదనపు ఎస్పీ(అడ్మిన్) హుస్సేన్‌పీరా, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

### 21న మండల సర్వసభ్య సమావేశం

**హాలహర్వి:** ఈనెల 21వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నెట్టింకటమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి గురువారం తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కార చర్యలపై చర్చ జరుగుతుందని చెప్పారు.

### కోలుకోలేక వ్యక్తి మృతి

**చిప్పగిరి:** దారికి వేసిన రాళ్ల విషయంలో గొడవపడి తీవ్రంగా గాయపడిన మండలంలోని బంటనహాలు గ్రామానికి చెందిన కాజీపురం రామాంజనేయులు కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామాంజనేయులు, అదే గ్రామానికి చెందిన తలారి సురేష్ దారిలో వేసిన రాళ్ల విషయంలో సోమవారం గొడవపడ్డారు. గొడవలో రామాంజనేయులుకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఆర్థిక సాయం

**హాలహర్వి:** మండల కేంద్రానికి చెందిన ఎరుకల నాగరాజు కిడ్నీ సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బాపురం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చెన్నబసప్ప ఆధ్వర్యంలో గురువారం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు నాగన్నగౌడ్, సదానంద, శివప్పగౌడ్, కృష్ణ, రవి, తిప్పయ్యస్వామి, సుగప్పగౌడ్ పాల్గొన్నారు.

### ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు

**కౌతాళం:** మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి సమాధి



కృష్ణగిరి సమీపంలో కాకర పంటకు పందిరి వేసిన దృశ్యం

## కొత్త పద్ధతి గురూ!

**కృష్ణగిరి:** అన్నదాతలు పంటల సాగులో నూతన ఒరవడిని అనుసరిస్తున్నారు. సాగులో సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. కూరగాయలు పంటలు సాగులో టమాట మాదిరిగానే కాకర పంటకు పందిరి వేసి వాటికి తీగలను కట్టారు. ఈ విధానం ఎక్కువగా కోస్తా ప్రాంతంలో దొండ, కాకర, టమాట తదితర పంటలకు ఇలా చేస్తారని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇలా చేయడం వల్ల పైరుకు గాలి బాగా తగిలి అధిక దిగుబడి రావడంతోపాటు పంట ఎక్కువ రోజులు వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

## బోర్డు ఏర్పాటు చేయరూ!



సచివాలయ బోర్డుకు రంగేసిన దృశ్యం

**దేవనకొండ:** స్థానిక పంచాయతీ కార్యాలయంలో గత ఐదేళ్లుగా సచివాలయం–1, 2 కొనసాగుతున్నాయి. అయితే నెల రోజుల నుంచి ఆ సచివాలయాల బోర్డులను అధికారులు తొలగించారు. నేటికీ నూతన బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో సచివాలయాలను ఎక్కడ నిర్వహిస్తున్నారో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సచివాలయ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న వ్యవసాయధికారులు

## తగ్గిన శనగ దిగుబడి

**మద్దికెర :** ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పు శనగ పంట దిగుబడి చాలా తక్కువగా వచ్చిందని మండల వ్యవసాయాధికారి రవి తెలిపారు. గురువారం మద్దికెర పడమర పొలాల్లో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ 4 రకాల ప్రయోగాలు చేశామని, అన్నింటిలోనూ దిగుబడి తక్కువగా నమోదైందని చెప్పారు. ప్రయోగాల అనంతరం నివేదికలను జిల్లా అధికారులకు పంపుతామన్నారు. ప్రయోగం – 1 లో 2.24 కిలోలు, ప్రయోగం – 2 లో 2.72 కిలోలు, ప్రయోగం– 3 లో 2.52 కిలోలు, ప్రయోగం – 4 లో 4.285 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. ఏఈఓ భోజరాజు, వ్యవసాయ సహాయకులు జాకీర్ హుస్సేని, టాటా బీమా కంపెనీ ఏజెంట్ రవి ఉన్నారు.

## పంచాయతీ స్థలం.. పరులకు ఆదాయం!

- ఆలూరు పంచాయతీ నిర్వహణ కోసం 1954లో 32.20 ఎకరాల విరాళం
- 15ఏళ్లుగా 15 ఎకరాలను ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్న అక్రమార్కులు
- పలుమార్లు సమావేశాల్లో చర్చించిన వార్డు సభ్యులు
- చర్యలు తీసుకోని అధికారులు

ఆలూరు గ్రామ పంచాయతీ భూమిలో సాగుచేసిన పత్తి పంట (ఫైల్)



**ఆలూరు:** గ్రామ పంచాయతీ నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులకు తలెత్త కూడదనే ఉద్దేశంలోనే అప్పటి గ్రామ పెద్దలు కోట్ల రూపాయాల విలువ చేసే వ్యవసాయ భూమిని విరాళంగా ఇచ్చారు. కార్మికుల జీతభత్యాలు, వివిధ రకాల పనుల కోసం 30.20 ఎకరాల వ్యవసాయ మెట్ట భూమిని ధారాదత్తం చేశారు. ప్రస్తుతం ఈ భూమి రూ.కోట్లు విలువజేస్తుంది. ఈ భూమిపై అక్రమార్కుల కన్ను పడటంతో ఆక్రమణకు గురైంది. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**వివరాలు..**

1954లో పంచాయతీగా ఏర్పడిన ఆలూరుకు ఆదాయ వనరులు లేకపోవడంతో ఆలూరుకు చెందిన భాస్కర్‌రావు చిప్పగిరి మండలం, రామదుర్గం గ్రామంలోని సర్వే నంబర్‌లోని 484 లోని 32.20 ఎకరాల వ్యవసాయ భూమిని (మెట్ట) పంచాయతీకి విరాళంగా ఇచ్చారు. ఈ భూమిని కౌలుకు ఇచ్చి ఆ సొమ్ముతో ఆలూరులో అభివృద్ధి పనులతో పాటు మేనేజ్‌మెంట్ వసతి గృహం (అప్పటి భాస్కర్‌రావు సత్రం) నిర్వహణకు ఉపయోగించాలని తీర్మానం చేశారు. అలాగే.. ఆలూరులో ఉన్న వసతి గృహానికి సర్వే నం 707/బి లోని 19 సెంట్లు కేటాయించారు. స్థానిక పాత బస్టాండ్‌లో సర్వే నంబర్ 746/బి1లో 60 సెంట్లు, పంచాయతీలో ఉద్యోగులకు నివాసం ఉండేందుకు గాను 667/ఏ–1 లో 31 సెంట్లు, వారపు సంత మార్కెట్‌కు సర్వే నంబర్ 746/డిలోని 2.10 ఎకరాలను కర్నూల్–బళ్లారి రోడ్డు సమీపంలో డంపింగ్ యార్డుకు 666/ఏలో 2.25 ఎకరాల భూమిని దాతలు కేటాయించారు.



స్థలంలో ఏర్పాటు చేసిన ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన బోర్డు

**15 ఎకరాల ఆక్రమణ..**

చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామంలో సర్వే నం 484లోని 32.20 ఎకరాలోల 15 ఎకరాలను 15 ఏళ్ల నుంచి కొందరు ఆక్రమించుకొని పంటలు సాగు చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులు సమావేశంలో ప్రస్తావించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని సభ్యులు వాపోతున్నారు. ప్రస్తుతం ఈ భూమిలో కొందరు గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఎఫ్ఏలు, చిప్పగిరి మండలానికి చెందిన ఏపీఓ, టీసీలు తదితరులు 2014లో ఉపాధి హామీ పనులు ద్వారా ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్,డక్ అవుట్లు తదితర రకాల పనులు చేయించి నిధులను స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి.

### భూమి ఉన్న విషయం నాకు తెలియదు

ఆలూరు మేజర్‌గ్రామ పంచాయతీ నిర్వహణ కోసం వ్యవసాయ భూమి ఉన్న విషయం నాకు తెలియదు. మూడు నెలల క్రితం తాను ఆలూరు ఈఓగా బాధ్యతలు స్వీకరించాను.పంచాయతీకి ఎన్నిరకాల స్థిరాస్తులు ఉన్నాయన్న విషయంపై సిబ్బందితో చర్చించి రికార్డులు పరిశీలించి, ఆక్రమణదారులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– వై.ప్రభాకర్, ఆలూరు ఈఓ